క్లుప్తంగా

గోవింద భక్తుల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న గోవిందభక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి దళితవాడకు చెందిన గోవింద భక్తులు మంగళవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. స్థానిక గంగమ్మ ఆలయం వద్ద గోవింద భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడులు కట్టి తిరుమలకు బయలుదేరారు. ప్రతి సంవత్సరం ఇలా భక్తులు పాదయాత్రగా వెళ్లి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గోవిందభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ ధరణీధర

ఐరాల: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కాణిపాకం ఎస్ఐ ధరణీధర హితవు పలికారు. మండలంలోని అగరంపల్లె ఆర్చి వద్ద మంగళవారం ఎస్ఐ హెల్మెట్ ఆవశ్యకతపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానా విధించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే సమయంలో హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐ వాహనదారులతో విధిగా హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో 'ఎస్ఏ -1' ప్రశ్నాపత్రాలు



ఎస్ఏ ప్రశ్నపత్రాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

బంగారుపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మేటివ్-1 ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ లాక్ రూమ్‌లో భద్రపరచినట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. యూట్యూబ్‌లో సోమవారం టెస్ట్ ప్రశ్నపత్రాలు లీక్ అయిన నేపథ్యంలో ఎంఆర్‌సీలో భద్రపరచిన ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచినట్లు తెలిపారు. మంగళవారం జరగాల్సిన ఎస్ఏ-1 పరీక్ష ప్రశ్నపత్రాలను ఉదయం 8.15 గంటలకు పోలీస్ స్టేషన్‌లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం జరగవలసిన ప్రశ్నపత్రాలను 12.15 గంటలకు అంద జేస్తామన్నారు. ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా సంబంధిత ఉపాధ్యాయులు జాగ్రత్త పడాలని హెచ్చరించారు.


ఆక్రమణల తొలగింపు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న టీపీఓ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: నగర పాలక సంస్థ ఆదేశాల మేరకు చిత్తూరు నగరంలోని హైరోడ్డు ఆక్రమణల తొలగింపునకు మంగళవారం టీపీఓ నాగేంద్ర చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణదారులతో మాట్లాడి ఆక్రమణలను తొలగించారు. ఇందుకు అందరూ సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎస్వీయూనివర్సిటీ ఆచార్యులు మురళీధర్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ విద్యార్థుల మానసిక ఆరోగ్యస్థితి విశ్లేషణాత్మక అధ్యయనం పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కణ్ణన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ తాను రచించిన పుస్తకాన్ని మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ ఆచార్యులు మురళీధర్ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. నేటి విద్యావిధానంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆరోగ్య, మానసిక పరిస్థితులను పరిశోధించి పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం ఆచార్యులు మత్తయ్యన్, అధ్యాపకులు పద్మనాభం, విజయకుమార్, నాగరత్నంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే వ్యవసాయ రంగం క్రమేణా నిర్వీర్యమవుతోంది. ఖరీఫ్‌లో అసలు రైతులను పట్టించుకోకపోవడంతో భారీగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఈసారి రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇవ్వకపోయినా విధిలేని పరిస్థితుల్లో అప్పులబాట పడుతున్నారు. నారుపోశారు.. సాగు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది. కొందరు నారు పోసినా అప్పుల సాగు చేయలేమంటూ దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. మరి కొందరు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఖరీఫ్‌లోనూ ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా రైతులకు అందలేదు. కనీసం ఈ రబీలో నైనా పెట్టుబడి సాయం అందుతుందని అన్నదాతలు ఎదురు చూశారు. అయితే ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.



కంపలపల్లె దగ్గర వరి పంట సాగు కోసం దుక్కి చేస్తున్న రైతు

అప్పుల బాటలో అన్నదాత

- పెట్టుబడి సాయం కోసం అవస్థలు
- వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించిన సర్కారు
- రబీలోనూ తగ్గుతున్న సాగు విస్తీర్ణం

తవణంపల్లె: రైతులు రబీలో వరి సాగు కోసం అప్పుల బాట పడుతున్నారు. గత ప్రభుత్వంలో వ్యవ సాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. రైతన్నలకు వ్యవసాయ పనులు చేపట్టకముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి నిధిని జమ చేసి ఊరట కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పక్కన పెట్టింది. వ్యవసాయం దండగ అనేరీతిలో వ్యవహరిస్తోంది. ఫలితంగా పెట్టుబడి సాయం కోసం రైతన్న అవస్థలు పడుతున్నాడు. రబీ సీజన్‌లో వరి సాగు చేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్న ఆశతో రైతులు ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. రైతులు పొలాల్లోకి పశువుల ఎరువులు తోలించడం, దుక్కులు దున్నడం వంటి పనులకు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి వరి విత్తనాలు తెప్పించి నారు పోస్తున్నారు. రబీ సీజన్‌లో మండలంలో 196 హెక్టార్ల(480 ఎకరాలు)లో వరి సాగు చేయాలని ప్రభుత్వ లక్ష్యం. అయితే ఇప్పటివరకు ఇందులో సగం విస్తీర్ణం కూడా సాగులోకి రాలేదు. దీంతో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి రైతులకు పంటల సాగు, నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. కానీ అధికారులను పెట్టుబడి నిధిపై నిలదీస్తున్నా మౌనం పాటిస్తున్నారు. అయితే అప్పులు చేసి వరి పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలంటూ వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు.

కాలిబాటలు వదులుకోవాలి

రైతులు పొలంలో వరి నాట్లు వేసేనప్పుడు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు తూర్పు, పడమర దిశలో కాలి బాటలు వదలు కోవాలి. దీని వల్ల పంటకు గాలి వెలుతురు సోకడం వల్ల ఎక్కువ పిలకలు వచ్చి అధిక దిగుబడి వస్తుంది. దోమపోటును అరికట్టవచ్చు.

యాజమాన్య పద్ధతులు

వరి పంట ఆరోగ్యంగా పెరిగి దిగుబడి సాధించాలంటే ఎరువుల యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పశువుల ఎరువును ఎకరాకు పది టన్నులు(రెండు లోడ్లు) వేయాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడడం మంచిది. నత్రజని ఎరువులు మూడు దఫాలుగా ఎకరాకు 120 కిలోలు వాడాలి. నాట్లు వేయక ముందు, పిలకలు వచ్చేటప్పుడు, ఎన్ను దశలో ఎరువులు వాడాలి. భాస్వరం ఎరువు నాట్లుకు ముందు ఎకరాకు దుక్కిలో వంద కిలోలు దుక్కిలో వేయాలి. ఎకరాకు పొటాష్ ఎరువును దుక్కిలో 25 కిలోలు, ఎన్ను దశలో యూరియాతో కలిపి వేయాలి. జింకు సల్ఫేటు ఎకరాకు 20 కిలోలు చొప్పున రెండు పంటలకు ఒకసారి ఆఖరి దుక్కిలో తప్పకుండా వేసుకోవాలి.

వరి సాగులో మెళకువలు పాటించాలి



రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు తగు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. విత్తనశుద్ధి తప్పకుండా చేసుకోవాలి. భూసార పరీక్షల ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడడం మంచిది, సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలి. సమగ్ర సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలి.

జి. ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె



ఏపుగా పెరిగిన వరినారు

- మేలైన వంగడాలు ఎంపిక చేసుకోవాలి
- రబీలో వరి సాగు చేసే రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా డీలర్ దగ్గర బిల్లు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యే వరకు రైతులు బిల్లులకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.
- ఎన్ఎల్ఆర్- 34449(నెల్లూరు మసూర సన్న రకం) రకం విత్తనాలు మంచి దిగుబడి వస్తోంది. పంట కాలం 125 రోజులు.
- ఇది అగ్గితెగులు తట్టుకొంటుంది. గింజ నాణ్యతగా ఉంటుంది. ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తోంది.
- బిపిటి- 5204(సన్న రకం సాంబా మసూర) రకం పంట కాలం 135 రోజులు. ఈ రకం మంచి దిగుబడి వస్తుంది. ఎకరాకు సుమారు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తోంది.
- ఎన్ఎల్ఆర్-3140 రకం(నెల్లూరు సోనాలు సన్న రకం) పంట కాలం 140 రోజులు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది.
- ఎన్‌డీఎల్ఆర్-8 (నంద్యాల రకం సన్నరకం) విత్తనాల పంట కాలం 125 రోజులు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. దోమను కొంత వరకు తట్టుకొంటుంది.
- **విత్తన మోతాదు**

  రైతులు ఎకరాకు 20 కిలోల విత్తనాలు నారు పోసుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరం.
- **విత్తన శుద్ధి తప్పని సరి**

  రైతులు ఎంపిక చేసిన విత్తనాలను విత్తన శుద్ధి చేసి నారు పోయాలి. లీటరు నీటిలో 4 గ్రాములు కార్బన్‌డిజం మందులు కలిపి, అందులో మొలకెత్తడానికి విత్తనాలు వేయాలి. ద్రావణంలో మొలకెత్తిన విత్తనాలను ఆరబెట్టి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లాలి.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలి

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో చేపడుతున్న ఎన్టీఆర్ మన ఇల్లు గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్, ఎంఈ వెంకటరామి రెడ్డి హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో మంగళవారం సాయంత్రం హౌసింగ్ పురోగతిపై సమీక్షించారు. ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక పరిధిలోని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా ఇప్పటికే రెంటల్ లేవల్స్ వరకు పూర్తి చేసిన గృహాలను నెల రోజుల్లో, జనవరి 15కల్లా పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

లబ్ధిదారులను సమన్వయం చేసుకొని పనులు జరిగేలా చూడాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ప్రత్యేక అధికారి కె.హరినాథ్ రెడ్డి, ఈఈ నాయక్, ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

బంగారుపాళెం: ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తికి బంగారుపాళెం ఎస్టీ రెషిడెన్షియల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలని కోరారు. గత పదేళ్లుగా మారుమూల ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ఏడేళ్లుగా జీతాలు పెంచలేదని పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ క్యాడర్ కంటే తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 పీఆర్సీ ప్రకారం జీతభత్యాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు.



జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

కలెక్టరేట్‌లో భద్రతా అంశాల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్ ప్రాంగణంలో భద్రతా పరమైన అంశాలను అగ్నిమాపక, పోలీసు, విద్యుత్ శాఖల అధికారులు పరిశీలించారు. ఆ శాఖల అధికారులు బృందంగా ఏర్పడి మంగళవారం కలెక్టరేట్‌లోని పలు ప్రాంతాలను పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లో భద్రతపరంగా ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా, భద్రతకు చేపట్టాల్సిన అంశాలు ఏమైనా చేపట్టాలా అనే అంశాలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటు పర్యవేక్షణ, వైరింగ్ వ్యవస్థ, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలనే అంశాలను గుర్తించారు. ఈ పనులకు త్వరలో నిధులను కేటాయించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కులశేఖర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆర్‌జీఎస్ఏపై శిక్షణ

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీడీ సమావేశ భవనంలో బుధ, గురువారాల్లో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్ఏ) కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

మద్యం తాగి బండి నడపొద్దు

చిత్తూరు అర్బన్: మద్యం తాగి బండి నడపొద్దని ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు పేర్కొన్నారు. డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన 11 మందికి సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌కోర్టు జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఆదివారం చేపట్టిన తనిఖీలో ఈ 11 మంది పట్టుబడ్డారని సీఐ తెలిపారు. ఈ 11 నెలల వ్యవధిలో 623 డ్రంక్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఇందుకు గానూ రూ.62.4 లక్షల జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రీ సర్వే తప్పిదాలను పరిష్కరించండి

–డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

గంగాధరనెల్లూరు : రీ–సర్వేలో జరిగిన తప్పులను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆదేశించారు. మండలంలోని నందనూరు, వెజ్జుపల్లెలో మంగళవారం నిర్వహించిన రీ–సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతుల భూ సమస్యలను, ఇబ్బందులను పరిష్కరించేందుకు రెవెన్యూ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులు ప్రత్యేక రీసర్వే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టుదారులకు అవగాహన



సమావేశంలో ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న దృశ్యం

గుడిపాల: పంటనీరు ప్రణాళికపై ఆయకట్టుదారు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బంగారక్క చెరువు ఆయకట్టుదారు రైతులతో ప్రజాప్రగతి ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ టీఎల్ దేవేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు మరియు వ్యవసాయ పరివర్తన పథకం గురించి సమావేశం నిర్వహించారు. జలవనరుల శాఖ నుంచి విచ్చేసిన డెప్యూటీ డైరెక్టర్ గోవర్ధన్, ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక మాట్లాడుతూ పంట ప్రణాళిక వేయడం ద్వారా భూగర్భ జలాలను భావితరాలకు అందించడం మరియు తక్కువ నీటితో వ్యవసాయ విధానాన్ని రైతులకు తెలియజేశారు. పంట ప్రణాళిక వేయడంతోపాటు గణాంకాల గురించి రైతులకు తెలియజేశారు.

బంగారమ్మ జాతర కోలాహలం



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ



అలరించిన మదన వేషాలు

కార్వేటినగరం: జాతరను పురస్కరించుకుని స్థానిక గ్రామదేవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. మండల కేంద్రంలో ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది. యువత, వివిధ వేషధారణలతో పిల్లలు, పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు. బంగారమ్మ, నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే అంబలిని భక్తులకు పంచిపెట్టారు. మహిళా భక్తులు తడిదుస్తులతో ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు. కొందరు వేపాకులను ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఇక, అమ్మవారి ఆలయాన్ని సుగంధ భరిత పుష్పాలతో, గ్రామ వీధులను సైతం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై ,ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్ పర్యవేక్షించారు. కార్వేటినగరం గంగ జాతర పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదన వేషాలు చూపరులను అలరించాయి. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సీఐ హనుమంతప్ప సూచించారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ చెప్పారు.

ప్రతి ఇంటికీ వైద్యసేవలు



చిత్తపారలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సంధ్య



దిగువమత్యంలో సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

గుడిపాల: ప్రతి ఇంటికి సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. చిత్తపార గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో అవసరమైన వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 62 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

తవణంపల్లె: ఇంటింటికీ వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దిగువ మత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు వైద్య సేవలందించారు. రోగులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. వ్యక్తిగత శుభ్రత తీసుకోవాలని సూచించారు. జ్వరాలు సోకిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భవతులు 104, 108 వాహన, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పడిగాపులు

రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు పడిగాపులు కాశారు. స్థానిక అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యాలయంలో లేరు. కలెక్టరేట్‌లో సమావేశానికి అధికారులు వెళ్లడంతో క్రయ, విక్రయ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్స్ కోసం వచ్చిన వారు వేచి చూశారు. ఇన్‌చార్జి సబ్-రిజిస్ట్రార్లు దాదాపు రెండు గంటల పైగా కార్యాలయంలో లేకపోవడంతో సేవలు స్తంభించాయి. ఇప్పటికే రెవెన్యూ సదస్సుల పేరిట సీనియర్ సహాయకులు ఉదయం వెళ్లి మధ్యాహ్నం తర్వాత కార్యాలయానికి వస్తున్న విషయం తెలిసిందే.

– చిత్తూరు కార్పొరేషన్

అధికారులు లేక ఖాళీగా ఉన్న సీట్లు





వేచి ఉన్న వినియోగదారులు